విజన్ వివేకానంద టాలెంట్ టెస్ట్ బ్రోచర్ ఆవిష్కరణ

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 14 : విజన్ వివేకానంద టాలెంట్ టెస్ట్ బ్రోచర్‌ను కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం కోసం టాలెంట్ టెస్ట్ దోహదపడుతుందన్నారు. జనని స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆలేరులోని వీఆర్ కళాశాలలో విజన్ వివేకానంద కోచింగ్ సెంటర్ సౌజన్యంతో పేద, మధ్య తరగతి విద్యార్థులను పోటీ పరీక్షలకు ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టాలెంట్ టెస్ట్ కన్వీనర్ కె.కమలాకర్, జేఎస్ఎస్ చైర్మన్ మైదం భాస్కర్, పేరపు ఆనంద్, మద్దూరి శ్రీకాంత్, జూకంటి సంపత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఢిల్లీలో పోచంపల్లి డబుల్ ఇక్కత్ మగ్గం డెమో

ఢిల్లీలో చేనేత మగ్గం ప్రదర్శనలో బోగ బాలయ్య, వీక్షిస్తున్న విదేశీయులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 14 : పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు బోగ బాలయ్య, వీవర్ అసిస్టెంట్ గంజి విజయ్ కుమార్ శుక్రవారం ఢిల్లీలో వీవర్స్ సర్వీస్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవెంట్‌లో డెమో ప్రదర్శించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పోచంపల్లి డబుల్ ఇక్కత్ గురించి మగ్గం ఏర్పాటు చేసి ఇక్కత్ వస్త్రాల ప్రాధాన్యతను వివరించారు. భారత్ టెక్స్ 2025 గ్లోబల్ టెక్స్‌టైల్స్ ఎక్స్‌పో ఇండియన్ లార్జెస్ట్ గ్లోబల్ టెక్స్‌టైల్స్ ఈవెంట్‌లో భాగంగా ఈ నెల 14నుంచి 17వరకు ఢిల్లీలో జౌళి ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇందులో 5వేల ప్రదర్శనలు, 6వేల మంది కొనుగోలుదారులు, లక్షా 20వేల మంది సందర్శకులు, 20వేల ఉత్పత్తులు పాల్గొంటున్నాయి. దీని ద్వారా పోచంపల్లి చేనేత ఉత్పత్తులు మంచి ఆదరణ పొందుతున్నాయని, ఈ వస్త్రాలు ఖండాంతర ఖ్యాతిగాంచిందని అన్నారు. పది వేల రంగులతో డబుల్ ఇక్కత్‌లో భారతదేశ పటం చేనేత మగ్గంపై నేయడాన్ని ప్రశంసించారు.

సాహిత్యానికి భవిష్యత్‌ను తీర్చిదిద్దే శక్తి

- తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి

సమావేశంలో మాట్లాడుతున్న ఆనందాచారి

రామన్నపేట, ఫిబ్రవరి 14 : సాహిత్యం మనిషిని మనిషిగా తీర్చిదిద్ది భవిష్యత్‌లో సన్మార్గంలో నడవడానికి దోహదపడుతుందని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు విభాగం మరియు సాహితీ ఉమ్మడి నలగొండ జిల్లా సంయుక్త నిర్వహణలో కవిత్వం, కథ, పాట రచనపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంచి మనిషిగా జీవించేవాడే దేవుడని, దేవుడిలా మానవత్వం గల మనిషిగా మారాలని, సాహిత్యం పుస్తకంలో లేనటువంటి విషయాలను తెలియజేస్తుందని అన్నారు. కార్యశాల కన్వీనర్, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ కళాశాలలో సృజనాత్మక విలువలను పెంపొందించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ప్రముఖ కథా రచయిత డాక్టర్ సాగర్ల సత్తయ్య 'కవిత్వం వస్తువు, నిర్మాణ పద్ధతులు' అంశంపై అవగాహన కల్పించారు. ఏబూషి నర్సింహ 'పాట వస్తువు, నిర్మాణ పద్ధతులపై అవగాహన కల్పించారు.

కళాశాల ప్రిన్సిపాల్ రహత్‌ఖానం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ ఉమ్మడి నలగొండ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి ఎండీ హసేన, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, అధ్యాపకులు జేసీ బాబు, శ్రీనివాస్, ఆంజనేయులు, సాహితీ మిత్రమండలి ప్రధాన కార్యదర్శి బాసరాజు యాదగిరి పాల్గొన్నారు.

పోస్టల్ బీమాను గీత కార్మికులు వినియోగించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నర్సయ్యగౌడ్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 14 : గీత కార్మికులందరూ పోస్టల్ ప్రమాద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు(ఎం) పట్టణ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్య గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షుడు గడం దశరథగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత వృత్తి ఎంతో ప్రమాదకరమైందన్నారు. ఈ క్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పాలసీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రమాద బీమా పాలసీ కోసం కౌండిన్య అసోసియేషన్ హఫ్‌నార్త్ అమెరికాతోపాటు గడ్డం దశరథగౌడ్ సహకారంతో గీత వృత్తి దారులందరికీ బీమా డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. సమావేశంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బీసు చందర్ గౌడ్, నాతి రాజు, వెంకన్న, కృష్ణమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

బస్వాపురం ప్రాజెక్టుకు రూ.500 కోట్లు కేటాయించాలి : సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో బస్వాపురం ప్రాజెక్టుకు రూ.500 కోట్లు కేటాయించి పనులను పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నిర్వాసితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలన్నారు. రిజర్వాయర్‌కు సంబంధించిన పెండింగ్ నిధులను రాబోయే బడ్జెట్‌లో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు ఏదునూరి మల్లేశం, కొండ అశోక్, కొండమడుగు నాగమణి పాల్గొన్నారు.

17, 18తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 14 : పట్టణంలో ఈ నెల 17, 18 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జి.రామలింగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపాక నుంచి హైదరాబాద్‌కు వచ్చే పైప్‌లైన్‌కు కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద మరమ్మతులు చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు నీటి సరఫరాను నిలిపివేశారని పేర్కొన్నారు. దాంతో హైదరాబాద్ నుంచి భువనగిరి మున్సిపాలిటీకి వచ్చే తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందని, ప్రజలు సహకరించాలని కోరారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్యం అందించాలి

- కలెక్టర్ హనుమంతరావు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : గర్భిణులకు వచ్చే సమస్యలను ముందుగా గుర్తించి ప్రత్యేక వైద్యం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ మనోహర్ అధ్యక్షతన శుక్రవారం జిల్లాలోని మహిళా ఆరోగ్య కార్యకర్తలకు సమీకృత అధిక ప్రమాదకర సమస్యలు గుర్తించుట, నిర్వహణపై ఆర్మన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవం జరిగేలా చూడాలన్నారు. ఇందుకోసం ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో గర్భిణులను కలిసి పోషకాహారం, రెగ్యులర్ చెకప్, వ్యాయామం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ అధిక ప్రమాదాల పరిస్థితి, నిర్వహణలో ఆరోగ్య కార్యకర్తల పాత్ర తెలియకపోవడంతో చాలా మంది మహిళలు, నవజాత శిశువులు మరణాలు, అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ యశోద గర్భిణులకు మెరుగైన సేవలు, సురక్షిత ప్రసవాలు, మాతృ మరణాలు లేకుండా చేయడం, హైరిస్క్ గర్భధారణ, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాస సమస్యలు, క్షయ వ్యాధి, పిల్లల పుట్టుక, జ్వరం వంటి అంశాలపై వివరించారు. ఆర్మన్ స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ సిబ్బంది డాక్టర్ రోహిణి, డాక్టర్ శివకుమార్ శిక్షణకు సంబంధించిన కోర్సు మెటీరియల్ సరఫరా చేసి గ్రామస్థాయిలో వారి విధుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని, హెల్త్ ఎడ్యుకేటర్లు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

భువనగిరి అర్బన్ : రక్తదానం మరొకరికి ప్రాణదానం అని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అవయవదానంపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదం జరిగిన వారికి అవసరమయ్యే అవయవాలు లభించక మరణిస్తున్నారన్నారు. దవాఖాన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ రాజారామ్, డాక్టర్లు చిన్న నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : బీఆర్ఎస్

పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

తుర్కపల్లి, ఫిబ్రవరి 14 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేక, ఎలా పాలించాలో తెలియక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతమతమవుతున్నారన్నారు. గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరిస్తున్నారని, బీఆర్ఎస్‌ను వదులుకొని తప్పు చేశామనే నిర్ణయానికి వచ్చారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ ముత్యాలు, పార్టీ మండల సెక్రటరీ జనరల్ శ్యాగర్ల పరమేశ్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ నల్ల శ్రీకాంత్, నాయకులు గిద్దె కర్ణాకర్, కల్లూరి నర్సింహారెడ్డి, ఆంజనేయులు, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ, షరీఫ్, ఐలేశ్, శ్రీకాంత్, భాస్కర్‌నాయక్, బద్దునాయక్, రాజయ్య పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లు సీజ్

గోకారం గ్రామ పరిధిలో పోలీసులు సీజ్ చేసిన ఇసుక డంప్

వలిగొండ, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంతోపాటు గోకారం గ్రామ పరిధిలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను పోలీసులు సీజ్ చేసి, ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. మండల కేంద్రంలోని రేగు సైదులుకు చెందిన 50 టన్నుల ఇసుక, మల్లేపల్లి గ్రామానికి చెందిన మల్ల బాలరాజుది 45 టన్నులు, వెల్వర్తి గ్రామానికి చెందిన ఎడవెల్లి గణేశ్‌ది 40 టన్నుల ఇసుక డంప్‌లను పోలీసులు దాడులు చేసి సీజ్ చేశారు. అదేవిధంగా గోకారం గ్రామంలో మూసీ నది నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలించి అక్రమంగా నిల్వ చేసిన గోకారం గ్రామానికి చెందిన మందుల నర్సింహది 30 టన్నుల ఇసుక, దేశపాక భాస్కర్‌కు చెందిన 40 టన్నుల ఇసుకను విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య

సమావేశంలో మాట్లాడుతున్న రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 14 : రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. పట్టణంలోని దుంపల మల్లారెడ్డి ట్రస్టు భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రజకుల ఉపాధి కోసం ప్రతి జిల్లాకు రూ.10 కోట్లతో మోడ్రన్ ధోబీ ఘాట్లు నిర్మిస్తామని, వృత్తిదారులందరికీ రూ.10లక్షల రుణాలు ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42శాతం వెంటనే అమలు చేసి, ఏబీసీడీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బొలగాని రాములు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన వెంకటేశం, ఉపాధ్యక్షుడు ఆవనగంటి స్వామి, సభ్యులు బాలరాజు, శ్రీనివాస్, నగేశ్, రమేశ్, కరుణాకర్, ఉప్పలయ్య, నర్సింహ, రాములు, భిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కాలిపోయిన ఫ్రిజ్‌ను చూపుతున్న బాధితుడు చంద్రయ్య

ఆత్మకూరు (ఎం), ఫిబ్రవరి 14 : మండలంలోని తుక్కాపురంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన సురగాని చంద్రయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల వివాహానికి వేరే గ్రామానికి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటికి మంటలు అంటుకున్నాయి. దాంతో ఇంట్లో ఉన్న ఫ్రిజ్, దుస్తులు, వంట సామగ్రి, 40వేల నగదు కాలిపోయాయి. సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ తాసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆరు గ్యారెంటీల అమలులో సర్కారు విఫలం : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జహంగీర్

చౌటుప్పల్, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా తదితర సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, గంగాదేవి సైదులు, రాగీరు కిష్టయ్య, సంజీవరెడ్డి, మధుకృష్ణ, నందీశ్వర్, సుదర్శన్, వెంకటేశం, శ్రీశైలం, నరేశ్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి : న్యూడెమోక్రసీ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మోటకొండూర్, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, సహదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను యాదగిరిగుట్టలో శుక్రవారం ఆవిష్కరించారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్, నాయకులు సోమయ్య, అడివయ్య, సుదర్శన్, నాగరాజు, శ్రీనివాస్, సమరసింహారెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన


చౌటుప్పల్ కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రామన్నపేట, ఫిబ్రవరి 14 : రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 13న న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ రామన్నపేటలో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మజీద్ మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గాలి లింగయ్య, సత్తయ్య, మామిడి వెంకట్ రెడ్డి, సుక్క శ్రవణ్, బర్ల డేవిడ్, పాల్వంచ జగతయ్య, సంగిశెట్టి బాలరాజు, శ్రీశైలం, దినేశ్‌కుమార్, నోముల స్వామి, రమేశ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, ప్రతినిధులు తాడూరి పరమేశ్, రాపోలు వేణు, పడమటి మహిపాల్‌రెడ్డి, జెల్ల రమేశ్, అల్లి స్వాతి, జక్కర్తి శేఖర్ పాల్గొన్నారు.


రామన్నపేట : నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

భువనగిరి అర్బన్ : రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

- అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల జాబితాలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై జడ్పీ సీఈఓ శోభారాణితో కలిసి ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో 178 ఎంపీటీసీ, 17 జడ్పీటీసీ స్థానాల కోసం 997 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా.. లేవా? పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు.

అపార్ నమోదు వంద శాతం పూర్తి చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

బీబీనగర్, ఫిబ్రవరి 14 : అపార్ నమోదు వంద శాతం పూర్తి చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి కె.సత్యనారాయణ పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ నమోదులో వేగం పెంచాలని, విద్యార్థులకు భవిష్యత్‌లో 12 అంకెల గుర్తింపు నంబర్ ఎంతో కీలకం అవుతుందని అన్నారు. విద్యార్థుల అపార్ నమోదుపై పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈఓ జి.సురేశ్ రెడ్డి, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీహరి ఉన్నారు.

నేతన్న పొదుపు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చేనేత పొదుపు దరఖాస్తులను స్వీకరిస్తున్న చేనేత, జౌళి శాఖ ఏడీపీ పి.సత్యనారాయణ

మోత్కూరు, ఫిబ్రవరి 14 : అర్హులైన ప్రతి చేనేత కార్మికుడు నేతన్న పొదుపు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీపీ పి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని పాలడుగు గ్రామంలో శుక్రవారం చేనేత కార్మికుల నుంచి నేతన్న పొదుపు పథకం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్గం నేస్తూ వృత్తిపైన ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికుల కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కార్మికుడు తన వేతనంలో రూ.1200, అనుబంధ కార్మికులు రూ.600 చొప్పున బ్యాంకులోని తన ఖాతాలో జమ చేస్తే ప్రభుత్వం దానికి రెండింతలు జమ చేస్తుందని తెలిపారు. ఆ డబ్బును రెండు సంవత్సరాల తర్వాత తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు, కార్మికులు చింతకింది సోమరాజు, లక్ష్మి, నల్ల యాదగిరి, వడ్డెపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందివ్వాలి

విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఏడీ ప్రశాంత్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 14 : విద్యార్థులందరికీ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందివ్వాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏడీ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంట ఏజెన్సీలందరికీ త్వరలో కొత్త వంట పాత్రలు అందివ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం రాందయాకర్‌రెడ్డి ఉన్నారు.

నాగారంలో బేటీ బచావో, బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు

బేటీ బచావో, బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న తల్లులు

వలిగొండ, ఫిబ్రవరి 14 : మండలంలోని నాగారం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బేటీ బచావో, బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను మహిళా సాధికారత బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత బృందం జెండర్ స్పెషలిస్ట్ కె.భార్గవి మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లులు శ్రద్ధ వహించి లింగవివక్ష లేకుండా చూడాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నిషేధమని తెలిపారు. మహిళా హక్కులు, బాలిక విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత బృందం సభ్యురాలు పుష్ప, అంగన్‌వాడీ టీచర్ అనూరాధ, రేణుక, మమత పాల్గొన్నారు.

కొండమడుగులో ఉచిత కంటి వైద్య శిబిరం

కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బీబీనగర్, ఫిబ్రవరి 14 : మండలంలోని కొండమడుగు గ్రామంలో మాజీ ఎంపీటీసీ కడెం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అభినవ్ కంటి ఆసుపత్రి సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మాజీ సర్పంచ్ కడెం బీరప్ప జ్ఞాపకార్థం కంటి వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడెం లతా రాజేశ్‌బాబు, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి గణేశ్‌రెడ్డి, నాయకులు రంగ కృష్ణవేణి గోపాల్ గౌడ్, బండమీది శ్రీరామ్ గౌడ్, బాషబోయిన రాము, సుదర్శన్‌రెడ్డి, అంజయ్య, శ్రీనివాస్‌గౌడ్, అంజిగౌడ్, లక్ష్మిరెడ్డి, మహేశ్‌గౌడ్, కిరణ్ పాల్గొన్నారు.